క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



మండవల్లి: మండలంలోని అల్లినగరంలో మండవల్లి, ముదినేపల్లి ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జిలు నాగవిజయ, గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో కృషి సఖిపై, మూడు రోజులు శిక్షణకు ఎంపికైన యాని మేటర్లకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం శిక్షణ అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీఎండీఎస్ పచ్చిరొట్ట పైర్లు పెంపకం, ఘన, ద్రవ జీవామృతాల తయారీ విధానం, ఉపయోగాలు ప్రయోగాత్మకంగా నిర్వహించి వివరించారు. సీసీలు నాగలక్ష్మి, అమల, వీఏఏలు, నాగరాజ్, బాలా, అశ్విని, కుసుమకుమారి, దనలక్ష్మి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: కరాటే ఇంటర్నేషనల్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మి ప్రసాద్ బుధవారం తెలిపారు. జనవరి 25న చెన్నైలో జరిగిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు కె. వేదశ్రీ నాగేంద్ర కుమార్ ద్వితీయ స్థానం, వై. కీర్తివర్షిణి సాయి, సీహెచ్. భవగ్య తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. బహుమతులుపొందిన విద్యార్థులు, కోచ్ ఎస్. వెంకటేశ్వరరావును పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి,ఐబ్రీనా అభినందించారు.

కల్యాణోత్సవాలకు శ్రీకారం

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఉత్సవాలు ఈ నెల 20నుంచి 26వరకు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. బుధవారం ఉదయం ఆలయంవద్ద ఉత్సవ పనులకు సంబంధించి రాట పూజ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ మీగడ నెలబాలుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక శివాలయం చైర్మన్ కంతేటి వరలక్ష్మి పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



కూచిపూడి(మొవ్వ): జనరల్ ఎలక్షన్స్-2024ను పురస్కరించుకుని పామర్రు సర్కిల్, కూచిపూడి పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. పామర్రు సీఐ వి.సుభాకర్, కూచిపూడి ఎస్ఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసులు మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన అయ్యంకి, పెదపూడి, మొవ్వ, మొవ్వపాలెం, కాజ గ్రామాల్లో ఈ కవాతు నిర్వహించారు.

15 నుంచి మూలలంక పెద్దింట్లమ్మ జాతర



కైకలూరు: కలిదిండి మండలం మూలలంక పెద్దింట్లమ్మ 55వ వార్షిక మహోత్సవం ఈ నెల 15 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తమ్మినేని నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆటపాకలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను కలిసి ఆయనకు ఆహ్వానపత్రాన్ని బుధవారం అందించారు.

నేడు అంబేడ్కర్ విగ్రహ భూమి పూజ

గుడివాడ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సీ సంఘాల నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చేతుల మీదుగా భూమి పూజ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎస్సీ సంఘాల నాయకులు, అభిమానులు, అంబేడ్కర్ అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పెడన: పట్టణంలోని దక్షిణతెలుగుపాలెంలో సెబ్ అధికారులు, సిబ్బంది బుధవారం వేకువజామున దాడులు నిర్వహించారు. పెదుమాల దవి అనే వ్యక్తి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. సెబ్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సెబ్ ఎస్సైలు సిబ్బంది దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 25 కేజీల బెల్లాన్ని, ఐదు కేజీలు అమోనియాను, ఒక కేజీ ఉస్టను సీజ్ చేశారు. ఏపీ ప్రొహిబిషన్ యాక్టు ప్రకారం దవిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ అధికారులు తెలిపారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్

కురుమద్దాలి(పామర్రు): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని కురుమద్దాలిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా సచివాలయ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎన్నో రకాల సేవలు అందుతున్నాయన్నారు. విత్తనాల నుంచి ధాన్యం అమ్మకాల వరకు ఆర్బీకేల ద్వారా జరుగుతున్నాయని తెలిపారు. గ్రామ సర్పంచ్ గోత్రు విజయభారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, నాయకులు చిన్న బుజ్జి, పెద్ద బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



కురుమద్దాలి సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



కోటిరెడ్డిపేటలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పామర్రు: గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించి, ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. పామర్రు, మండలంలోని జమీగొల్వేపల్లి, కొమరవోలులో పలు సీసీ రహదార్ల ప్రారంభోత్సవాలను ఎమ్మెల్యే బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని 106 గ్రామాల పరిధిలో 72 సచివాలయాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కోటిరెడ్డి పేటలో జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.23 లక్షలు, పంచాయతీ నిధులు రూ.15 లక్షలు మొత్తం రూ.48 లక్షలతో ఏడు సీసీ రహదారులను నిర్మించి, ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామంలోని 15వ వార్డులో రెండు, 17వ వార్డులో ఒక సీసీ రహదారిని పంచాయతీ జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ. 22లక్షలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని జమీగొల్వేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 25 లక్షలతో నాలుగు సీసీ రోడ్లను నిర్మించి ప్రారంభించినట్లు తెలిపారు. కొమరవోలులో ఐదు సీసీ రహదార్లను నిర్మించి ప్రారంభించామన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు ప్రజలందరూ సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కె స్వరూపరాణి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, పీ రత్నకుమారి, నాగ మల్లేశ్వరరావు, మండల కో–ఆప్షన్‌సభ్యులు హస్మతుల్లా, సర్పంచ్‌లు కె కస్తూరి, ఆర్.శాంతకుమారి, దిరిశం రత్నకుమారి, విజయభారతి, పామర్రు ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలం వీరంకిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

సచివాలయాలతో ప్రజల ముంగిటకే సేవలు

పమిడిముక్కల: సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, వలంటీర్ల నియామకంతో ప్రజల ముంగిటకే పౌర సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వీరంకిలో రూ.43.06 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని మంగళవారం రాత్రి ఎంపీపీ కాసాని వేద సుప్రజ, సర్పంచ్ కాసాని నాగేశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా అమీనపురంలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని సంఘ అధ్యక్షుడు మోరంపూడి కోటంరాజుతో కలిసి ప్రారంభించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ చారిత్రాత్మకం

ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ పేదలకు పట్టాలు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై సర్వహక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. పడమటిపాలెం, గోపాలపురం, చిన తాడినాడలో పర్యటించి పలు అభివృద్ధి పనులను, ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు బాగుండాలన్నా, రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలన్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. చిన తాడినాడ పరిధి పల్లిపాలెంలో జీఎస్‌బీ రోడ్ల శంకుస్థాపన, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. విభరామాపురంలో నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఇంటి లబ్ధిదారులకు 27 రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను అందజేశారు. గోపాలపురంలో మైక్రో వాటర్ ఫిల్టర్ పైప్‌లైన్‌కు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో 24 రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. పడమటిపాలెంలో వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించి, రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవతి, జిల్లా వ్యవసాయ మార్కెట్ అధ్యక్షుడు చిట్టూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కూనంపూడి కనక దుర్గారాణి, నాగలక్ష్మి, సర్పంచ్‌లు అనపర్తి వడ్డి కాసులు, సాన మీనా సరస్వతి, ఏసుబాబు, రాము పాల్గొన్నారు.



చినతాడినాడలో ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం

కైకలూరు: నియోజకవర్గంలో రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. కైకలూరు పంచాయతీ పరిధిలో శ్యామలాంబ దేవస్థానం నుంచి వారపు సంత మార్కెట్ వరకు, ఫైర్ స్టేషన్ రోడ్డు కలిపి రూ.40,30,000 నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు, శ్యామలాంబ, కనకలింగేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్లు గుర్రం రాంబాబు, బూరుబోయిన మోహనరావు, తోట మహేష్, ఉలిసి శ్రీనివాసరావు, బోయిన రామకృష్ణ, సమ్మెట సాంబశివరావు, కరేటి రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి ప్రచారం

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో తన భర్త దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నారని వీరాకుమారి అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ప్రజలను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొల్లేటిలంక గ్రామమైన పెంచికలమర్రులో బుధవారం ఆమె పర్యటించారు.

వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి

కైకలూరు: ప్రజలకు మంచి పనులు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాదయాత్ర 23వ రోజు ఆటపాక గ్రామంలో బుధవారం కొనసాగింది. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీ, సర్పంచ్ తలారి మణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్ తలారి మణి జాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'గుడ్ మార్నింగ్ కైకలూరు'

కైకలూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదికగా గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమం కొనసాగుతోంది. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రజలకు ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో 11వ రోజు కైకలూరు 6, 7 వార్డుల్లో గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట అడుగులు కదిపారు. తమ వీధిలో విద్యుత్ స్తంభం అవసరమని తమనాల సత్యం ఎమ్మెల్యేను కోరారు. ఆయన వెంటనే విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి స్తంభం వేయిస్తానని తెలిపారు. మరొక మహిళ ఆధార్ కార్డులో వయస్సు తప్పుగా రావడంతో పింఛను మంజూరు కాలేదని చెప్పింది. వలంటీరుతో చెప్పి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఇలా అనేక సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్ విక్టర్, ఎస్సీ ఎస్టీ సెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కూనవరపు సతీష్, ఎంపీటీసీ సభ్యుడు కొండయ్య, నాయకులు గాలిబ్ బాబు, ఉండ్రమట్ల ఏసుకుమార్, జయమంగళ కాసులు, గంగుల అశోక్, ముంగర గోపాలకృష్ణ, కన్నా రమేష్, దత్తాడా డేవిడ్, పంజా నాగు, బిరుదుగడ్డ లాజర్ పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను వింటున్న ఎమ్మెల్యే డీఎన్నార్

రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: మండలంలో ప్రధానమైన వడాలి–తాడినాడ ఆర్అండ్‌బీ రహదారి అభివృద్ధి పనులు బుధవారం సర్పంచ్ మరీదు దుర్గశ్రీ పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రహదారి సమస్యను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కు తెలియజేయగా ఆయన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మరీదు హనుమంతు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పాలన సీఎం జగన్‌కే సాధ్యం

పమిడిముక్కల: అభివృద్ధి, సంక్షేమ పాలన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. మండలంలోని కృష్ణాపురం, కూడేరు, వనపూరు, శ్రీరంగపురం, అలీనబీపాలెం గ్రామాల్లో గడప గడపకు నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత కపిలేశ్వరపురంలో నిర్మించిన చర్చిని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, సర్పంచ్‌లు వీరంకి బలుసలమ్మ, వీర్ల నాగరాజు, కొండా జయలక్ష్మి, పద్మావతి, ఉపసర్పంచ్ యార్లగడ్డ శివ, ఎంపీటీసీ సభ్యులు ఆదిశేషు, సజ్జాద్అలీ, మర్రి దుర్గారావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి పాల్గొన్నారు.

హైస్కూల్లో వేదిక నిర్మాణానికి శంకుస్థాపన

మండవల్లి: స్థానిక ఉన్నత పాఠశాలలో ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు ఆర్థిక సాయంతో నిర్మించనున్న వేదిక నిర్మాణానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కూల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా స్టేజ్ అవశ్యకత ఉంటుందన్నారు. దీని నిర్మాణానికి వీర్రాజు ఆర్థిక సాయం చేయడం హర్షణీయమన్నారు. ఏఎంసీ చైర్మన్ వీర్రాజు మాట్లాడుతూ ఇదే పాఠశాలలో తాను విద్యాభ్యాసం చేశానన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల, మండవల్లి, అప్పాపురం సర్పంచ్‌లు మెండా యూసీస్, బుర్ల భోగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ బాబీ తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్లో వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

గృహ నిర్మాణాలకు సిద్ధంకండి

గుడివాడ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు సిద్ధంకావాలని గృహ నిర్మాణ శాఖ గుడివాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీవీ రవికాంత్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సచివాలయాల కార్యదర్శుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కోరిక మేరకు నియోజకవర్గంలో నూతనంగా 1,728 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వాటిలో గృహ నిర్మాణాల కోసం ఒక్కొక్క ఇంటికి రూ. 1.8 లక్షల చొప్పున మొత్తం రూ.31 కోట్లు నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంగీకారం తెలపనున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. లబ్ధిదారులు సాధ్యమైనంత త్వరలో గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. లబ్ధిదారు దరఖాస్తుతో పాటు భార్యాభర్తల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ మొదటి పేజీ, కుటుంబం మొత్తం దిగిన ఫొటో, సెల్ నంబర్, కుల ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ ఎం. రామోజీనాయక్, ఏఈ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ రవికాంత్

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించండి

కైకలూరు: ఎన్నికల విధులపై అధికారులు అవగాహన కలిగి నిబంధనలు పాటించాలని కైకలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, శిక్షణ కలెక్టరు శ్రీపూజిత పేర్కొన్నారు. కైకలూరు ఉర్దూ స్కూల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంటు పోలింగు ఆఫీసర్లకు ఒక రోజు శిక్షణ బుధవారం అందించారు. నియమ నిబంధనల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి-1 భాస్కర్, నాలుగు మండలాల తహసీల్దార్లు పోతురాజు, సుభాని, వంశీ, కుమారి, కైకలూరు ఎలక్షన్ డీటీ కిరణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి

ముదినేపల్లి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. పార్టీ కైకలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ఏలూరు లోక్‌సభ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డీఎన్నార్, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ తరఫున మండలంలోని కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ అమలు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి జగనన్న మహిళల ఆర్థికాభ్యున్నతికి అనేక పథకాలు అందించారని అన్నారు. వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, నాయకులు బొర్రా శేషుబాబు, కోమటి విష్ణువర్ధన్, దాసరి శ్రీనివాసరావు, లేళ్ళ అంజనేయులు, పేర్ని పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న దూలం స్వాతి

పేదలకు మెరుగైన వైద్యం

గుడివాడ టౌన్: పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 18వ వార్డు కాకర్లవీధి, 25వ వార్డు పెద ఎరికపాడు సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 ఆరోగ్య వైద్య శిబిరాలను బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాల్లో రెండు సచివాలయాల పరిధికి చెందిన 930 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అల్లం సూర్యప్రభ, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లం రామ్మోహనరావు, ఎ.కృష్ణమోహన్, పీఎస్ రమణకుమార్, దేవరకొండ కోటి, వైద్యులు కెజియా, కిరణ్‌కుమార్, చంద్ర, గంగరాజు, జీజేడీ ట్విన్సన్, కవిత, కృష్ణగిరీష్, రాంబాబు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

విద్యార్థులు లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి

కలిదిండి: విద్యార్థులు తమ లక్ష్యం సాధన కోసం కృషి చేయాలని రిటైర్డ్ ప్రొఫెసర్ కెరీర్ ట్రైనర్ ఎస్ విజయకుమార్ విద్యార్థులకు సూచించారు. కలిదిండి మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో అరుతెగలపాడు హైస్కూల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు బుధవారం అందజేశారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు 2022-23 విద్యా సంవత్సరానికి 6 నుంచి 9వ తరగతులలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి, రెండవ స్థానాలు పొందిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు, బహుమతులను అందించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.పునరాజు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృత తనిఖీలు చేస్తున్నాం

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాభాయ్



ఆస్పత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ గీతాభాయ్

చల్లపల్లి: ప్రైవేట్ ఆస్పత్రులు, పరీక్షా కేంద్రాలు నిబంధనల ప్రకారం నిర్వహించేలా జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ జి.గీతాభాయ్ అన్నారు. కీర్తి హాస్పిటల్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఏఆర్‌టీ చట్టం ద్వారా సహాయ పునరుత్పత్తి సాంకేతిక కేంద్ర ఏర్పాటుకు అనువైన సదుపాయాలు, ఏర్పాట్లు పరిశీలించారు. అసిస్టెంట్ రీ-ప్రొడక్టివ్ టెక్నాలజీ ప్రజల్లో ఉన్న వంధ్యత్వం పరిష్కారానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఏఆర్‌టీ ద్వారా సంతాన ఉత్పత్తి చికిత్స చేయటానికి అవసరమైన మానవ వనరులు, యంత్ర సామగ్రి, సాంకేతిక పరికరాలు పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందించే వైద్య సేవలు, ధరల పట్టిక పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వైద్యశాలలు, క్లినిక్స్, పాలీ క్లినిక్స్, లేబొరేటరీ కేంద్రాలు, స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అన్ని కేంద్రాలు తనిఖీ చేసి నమోదు కాని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ బీ.శృతి, డాక్టర్ వినీల, డాక్టర్ గౌతమి, పీ.మస్తానమ్మ, బీ.రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలి


పామర్రు: నూతన ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని శ్రీ పల్లవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల తుది జాబితా తయారీకి సమయం ముగుస్తున్నందున గ్రామాల్లో ఇంకా ఎవరైనా నూతన ఓటర్లు ఉంటే తక్షణమే నమోదు చేయించుకోవాలన్నారు. దీనికి అన్ని పార్టీల రాజకీయ నేతలు తగు విధంగా సహకరించాలని కోరారు. ఇప్పటి వరకు వచ్చిన ఫారం 6,7,8 గురించి పార్టీ నేతలకు వివరించామన్నారు. కార్యక్రమంలో పెదపారుపూడి, పమిడిముక్కల మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల సహాయ అధికారి శ్రీపల్లవి

చిరు ధాన్యాల్లో అధిక పోషక విలువలు

కైకలూరు: చిరు ధాన్యాల్లో అధిక పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్య పేర్కొన్నారు. పోషన్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా కైకలూరు 2వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు చిరుధాన్యాలు, తృణ ధాన్యాలపై అవగాహన బుధవారం కలిగించారు. సీడీపీఓ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంపై ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పిస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక పదార్థాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. పోషన్ పక్వాడా కార్యక్రమం ఈ నెల 9 నుంచి 23 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం చిరుధాన్యాలతో చేసిన వంటకాలలో మహిళా విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.



చిరుధాన్యాలతో వంటల పోటీల్లో విజేతకు బహుమతి అందిస్తున్న సీడీపీఓ లావణ్య

నాగేశ్వరస్వామివారికి పవళింపు సేవ

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీ పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగాయి. బుధవారం ఉదయం ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి ఎనిమిది గంటలకు ప్రత్యేక పల్లకీలో ఆలయ ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు సాంప్రదాయ బద్ధంగా స్వామివార్ల పుష్పశయ్యాలంకృత పవళింపు సేవ భక్తిభావంతో నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

